- www.aknu.edu.in
- nannayavani@aknu.edu.in
- nannayanewstv
- Adikavi Nannaya University
- 9701293231






తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :14 | 04-01-2021 | పుటలు : 4




**2021**

ఆరోగ్యవంతమైన కాలాన్ని
అందించాలని ఆశిస్తూ...
నవ్య వత్సర శుభాకాంక్షలు!!

- నన్నయవాణి.

## నన్నయకు ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్



**మీడియా సెల్ 29.12.20 :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టేండేషన్) 9001-2015 సర్టిఫికేషన్ లభించిందని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో ఐఎస్ఓ సర్టిఫికెట్లను వీసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికేషన్ 2020లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన గొప్ప విజయమన్నారు. ఇదే స్ఫూర్తితో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టి 2021లో కచ్చితంగా నాక్ గుర్తింపులో మంచి గ్రేడ్‌ను సాధించాలని తెలిపారు. విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలకు ప్రతీకగా ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఉంటుందని చెప్పారు. వ్యక్తిగత విలువలు పాటిస్తూ నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి సాధించాలని తెలిపారు. నిర్దేశించిన సమయానికి ఐఎస్ఓ సర్టిఫికేషను సాధించిన విశ్వవిద్యాలయ ఐఎస్ఓ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.పెర్సిస్‌ను, వారి బృందాన్ని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికేషన్‌కు అందరూ ఎంతో సహకారాన్ని అందించారని, నాక్ గుర్తింపునకు సహకరించాలని తెలిపారు. ఐఎస్ఓ కోర్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.పెర్సిస్ మాట్లాడుతూ వీసీ ఆచార్య జగన్నాథరావు 2020 నాటికి ఐఎస్ఓ సర్టిఫికేషన్ సాధించాలనే టార్గెట్‌ను ఇచ్చి దానికి కావాల్సి అన్ని ఏర్పాట్లనూ చేసి పూర్తిగా సహకరించారని తెలిపారు. దాని ఫలితంగానే ఆశించిన సమయంలో ఐఎస్ఓ సర్టిఫికేషన్‌ను సాధించ గలిగామన్నారు. వీసీ ప్రోత్సాహంతో తక్కువ సమయంలో విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ సిహెచ్ఎన్‌కె.భవాని, ఎం.బాలకృష్ణ, గౌతమ్ నాయుడు సన్మానించి, శిక్షణ పూర్తి చేసుకున్న ఇంటర్నల్ ఆడిటర్లుకు సర్టిఫికెట్లను అందజేసారు. ఈకార్యక్రమంలో ఈసీ మెంబర్లు ఆచార్య టి.అశోక్, డాక్టర్ బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ కె.రమణేశ్వరి, ఐక్యూఎసి ఎగ్జిక్యూటివ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.స్వామి పాల్గొన్నారు.



ఏ రాపిడి లేకుండా...
వజ్రమెలా మెరుస్తుంది?!

ఏ అలజడి లేకుండా...
సంద్రమెలా నిలుస్తుంది?!

నడిపించే చైతన్యం లేనిదే
నడవదు ఈ సృష్టి !!

- ఆచార్య సి.నారాయణరెడ్డి



## ధనుర్మాసం

గోదాదేవి(ఆండాళ్) స్వయంగా రాసి,
పాడిన సంగీతం తిరుప్పావై!
"తాను ధరించిన పూలమాలికను
శ్రీరంగ నాథునికి సమర్పించిన"
ఘట్టమే 'ఆముక్తమాల్యద'!
అదే శ్రీకృష్ణదేవరాయలు
రచించిన దివ్య ప్రబంధం!!

ధనుర్మాస పుణ్యతిథుల శుభ కామనలతో.....

- నన్నయవాణి.

## నూతన ఆలోచనలతో వర్సిటీని అభివృద్ధి చేద్దాం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



**మీడియా సెల్ 01.01.21** నూతన సంవత్సరం 2021లో నూతన ఆలోచనలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేద్దామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. నూతన సంవత్సరం 2021 సందర్భంగా విశ్వవిద్యాలయ సిబ్బందికి ప్రత్యేక అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విభాగాల వారిగా కేంద్ర పరిపాలన భవనంలోని కార్యాలయాల్లో వీసీ, రిజిస్ట్రార్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరంలో మేలు జరగాలని, నూతన విద్యా విధానాలతో అభివృద్ధి సాధించాలని శుభాకాంక్షలు తెలియజేసారు. 2020వ సంవత్సరం అనేక సమస్యలను ఎదుర్కొన్నామని అయినప్పటికీ విద్యాపరమైన అంశాలలో రాజీపడలేదని ఆన్‌లైన్ విజ్ఞానాన్ని అందించామని చెప్పారు. 2021వ సంవత్సరంలో నూతన ఆలోచనలతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పరచేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని అన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలలకు చెందిన అధ్యాపకులను విద్యాపరమైన పరిశోధనపరమైన అంశాలలో ముందుండాలని సూచించారు. నూతన విద్యావిధానాలతో ఈ సంవత్సరం ముందుకు సాగాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారి విజ్ఞానాన్ని అన్‌లైన్ ద్వారా అందించి విజ్ఞానాన్ని వికసింపచేయాలని తెలిపారు. 2020వ సంవత్సరంలో ఐ.ఎస్.ఓ గుర్తింపు లక్ష్యాన్ని సాధించామని 2021లో నాక్ గుర్తింపును విశ్వవిద్యాలయ లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ మరియు అనుబంధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ



**మీడియా సెల్ 30.12.20 :** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదలచేసి వివరాలను తెలియజేశారు. డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థుల పరీక్ష ఫలితాలను విడుదల చేశామని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని 31,656 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాసారని వారిలో 16,150 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 51.02గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కోవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన యూనివర్సిటీ ఎగ్జామినేషన్ విభాగాన్ని అధికారులను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్ లింగారెడ్డి, తాడేపల్లిగూడెం ప్రత్యేక అధికారి ఆచార్య కొట్టి శ్రీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కట్టుకథ



జీవిస్తున్న వారిపై అపవాదులు వస్తే తమ నిష్కళంకతను నిరూపించుకోవడానికి అవకాశం ఉంది. కానీ మరణించిన వారిపై అపవాదులు వస్తే పాపం వాళ్ళు ఏం చేస్తారు? 11వ శతాబ్దంలో నన్నయ గారి గురించి 16వ శతాబ్దం తర్వాత జీవించిన కాకునూరి అప్పకవి 'అరణ్యపర్వం రాస్తున్న సమయంలో పిచ్చిపట్టి నన్నయ అరణ్యంలోకి వెళ్లి పోయాడని' రాశాడు. నన్నయ గారి మీద అప్పకవి చల్లిన బురద అది. ఆ మధ్యలో 600 సంవత్సరాలు ఎక్కడా ఇటువంటి మాట లేదు. కాదని నిరూపించుకోవటానికి నన్నయ గారు లేరుకదా! ఈ కట్టుకథ వలన అప్పకవి చేతులకు మాత్రం బురద మిగిలింది.వాగనుశాసనుడైన నన్నయ గారికి వచ్చిన నష్టమూ లేదు.అపవాదులంటే ఇలా ఉంటాయి. బురద చల్లడం పాపకార్యం కూడా.

రాజరాజ నరేంద్రుడు నిష్కళంక మూర్తి. ఆయన గొప్పతనాన్ని మహాభారతం"విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా రాజిత సర్వలోకుడ"ని తెలియజేసింది.మహారాష్ట్రలోని (మాళవదేశం)మాంధాత పురానికి చెందిన రాజమహేంద్రుడు కథలోని చౌరంగనాథుడు, రత్నాంగి, చిత్రాంగి పాత్రలను (తన కుమారుడైన సారంగధరునికి భార్యగా ఎంపిక చేసిన చిత్రాంగిని మహారాజు తానే పెళ్లి చేసుకున్నాడని, చిత్రాంగి ఆడిన నాటకంలో కుమారుని వధించాడని...) ఆంధ్రదేశంలోని రాజమహేంద్రవరానికి, రాజరాజ నరేంద్రునికి అంటగట్టారు. మహారాష్ట్రకథల్లోని చౌరంగనాథుడు రాజమండ్రిలో సారంగధరుడు అయ్యాడు. సారంగధర మెట్ట, చిత్రాంగి ప్యాలస్ పుట్టుకొచ్చాయి. 16వ శతాబ్దానికి చెందిన దోనూరి కోనేరునాథ కవి ద్విపద కావ్యంలో రాజమహేంద్రుని కథను రాజరాజనరేంద్రునికి ఆపాదించాడు. మధ్యలో 600 సంవత్సరాలుగా లేని కథ తరువాత 400 సంవత్సరాలలో చిలవలు పలవలైంది. చోళ చాళుక్యుల వాస్తవ చరిత్రలో ఏ కళంకం లేని రాజరాజ నరేంద్రుడు సారంగధర చరిత్రలో 'రాజరాజు'గా మిగిలాడు. ఈ 'అపవాదు' కట్టుకథను ఎవరు తొలగిస్తారు.ఎవరికి పని.ఎవరికీ నష్టం లేదు.లాభం అంతకన్నా లేదు.ఆంధ్రుల చరిత్ర పుటలకు అంటుకున్న బురద వలన ఎవరికి ఇబ్బంది.ఎవరికి అపవాదు?

'ఆంధ్రకేసరి' సినిమా కోసం ఆరుద్ర గారు "వేదంలా ఘోషించే గోదావరి...అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి" పాట రాస్తూ అందులో ' కట్టుకథల చిత్రాంగి కనక మేడలు'అన్నారు.అంతటి చరిత్ర,సాహిత్య పరిశోధకుడైన ఆరుద్రగారు అది "కట్టుకథ" అని రాసిన తర్వాత కూడా ఇంకా మనం చిత్రాంగి, రత్నాంగి, సారంగధరుడు వంటి సందర్భాలను రాజరాజనరేంద్రునికి, రాజమహేంద్రవరానికి ముడిపెట్టి మాట్లాడటం కాని, ఎక్కడా రాయటం కాని చేయకూడదు సరికదా... సందర్భం వచ్చినపుడు అది ఒక కట్టుకథ అనే విషయాన్ని చెప్పాల్సిన అవసరం, బాధ్యత తెలుగువారందరిపైనా ఉంది.

# చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనంలో అష్టాదశ సూత్రాలు



- కోటీశ్వరులు కావడం అందరికీ సాధ్యం కాదు, కానీ నిజాయితీపరులు కావడం ప్రతి ఒక్కరికీ సాధ్యమే.
- సుత్తితో ఒక్క దెబ్బ వెయ్యగానే బండరాయి ముక్కలవదు. దెబ్బ వెనుక దెబ్బ వెయ్యాలి. ఒక్క ప్రయత్నంలోనే విజయం సిద్ధించదు. ఎడతెగని ప్రయత్నం కావాలి.
- ఒకసారి బట్టలు మాసిపోతే మనిషి ఎక్కడ కూర్చోడానికి అయినా సిద్ధపడతాడు. అలాగే ఒకసారి నడత చెడిందంటే ఎలాంటి పనులుచేయడానికైనా సందేహించడు మనిషి.
- మనం మన ఆలోచనలకు బందీలం. ఆలోచనలను మార్చుకోనిదే దేన్ని మార్చలేం.
- గొడుగు వర్షాన్ని ఆపలేకపోవచ్చు. కానీ వర్షంలో తడిసిపోకుండా రక్షణ ఇస్తుంది. అలాగే ఆత్మ విశ్వాసం విజయాన్ని తెచ్చిపెట్టలేకపోవచ్చు. కానీ విజయపథలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించగల శక్తిని ఇస్తుంది.
- బలవంతుడికీ బలహీనుడికీ మధ్య జరిగే ఘర్షణలో ప్రేక్షకపాత్ర వహించడమంటే.. తటస్థంగా ఉన్నట్లు కాదు. బలవంతుడి పక్షం వహించినట్లు.
- అతి నిద్ర, బద్ధకం, భయం, కోపం, నిరాశావాదం– ఈ ఐదు అతి చెడ్డ గుణాలు. వీటిని పొరపాటున దగ్గరకు రానిచ్చినా జీవితంలో పైకి రావడం, సుఖపడడం జరగదు.
- అహంకారం ప్రతి ఒక్కరినుంచీ %--% అఖరికి భగవంతుడి నుంచి కూడా దూరం చేస్తుంది.
- ఉపాయాన్నిఅలోచించేటప్పుడే రాగల అపాయాన్ని కూడా అంచనా వేయాలి.
- నీ తప్పును ఈరోజు కప్పిపుచ్చకలిగినా రేపటి దాని పర్యవసానాన్ని మాత్రం తప్పించుకోలేవు.
- మంచివారు దూరం కావడం, చెడ్డవారు దగ్గర కావడమే దుఃఖాని కి నిదర్శనం.
- బలహీనుడిని బలవంతుడు కొడితే బలవంతుడిని భగవంతుడు కొడతాడు.
- కాళ్ళు తడవకుండా సముద్రాన్ని దాటగలవు. కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేవు.
- పక్షులకు కొంత ధాన్యం, పశువులకి కొంత గ్రాసం, మనిషికి కొంత సాయం%ఞా% ఇదే జీవితం.
- ఉత్తమ గుణాల వల్ల మవిషి ఉన్నతుడవుతాడు కానీ ఉన్నత పదవి వల్ల కాదు%ఞా% – శిఖరం మీద కూర్చొన్నంత మాత్రాన కాకి గరుడ పక్షి కాలేదు.
- మెరుగు పెట్టకుండా రత్నానికి, – కష్టాలు ఎదుర్కోకుండా మనిషికి గుర్తింపు రాదు.
- కేవలం డబ్బుంటే సరిపోదు. మంచి వ్యక్తిత్వం ఉంటనే సమాజం గౌరవిస్తుంది.
- ఎవరి వయస్సుకు తగ్గట్టు వారి ఆలోచనలు, ప్రవర్తన ఉంటనే ఆ వ్యక్తికి గౌరవం ఉంటుంది.

# యేసు మార్గం ఆదర్శనీయం : వీసీ ఆచార్య మొక్క జగన్నాథరావు

**మీడియా సెల్ 31.12.20** : యేసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో పయనించి భూలోకంలో జీవితాన్ని కొనసాగించాలని, యేసు మార్గం ఆదర్శనీయమని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వ విద్యాలయంలో అంతర్జాల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, పిఆర్ఓ పువ్వుల ఆనంద్ కోఆర్డినేటర్ వ్యవహరించిన ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్క జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించవలేను, ప్రయాసపడి భారం మోయు సమస్త జనులారా నా యొద్దకు రండి అంటూ యేసు క్రీస్తు చూపిన శాంతి సత్య బోధలు లోకానికి వెలుగు గా నిలిచాయని అన్నారు. యేసు మాటలు నేటి ప్రపంచానికి ఎంతో అవసరమని, ఆయన ప్రేమ శాంతి దయ విధేయత వంటి లక్షణాలు మానవులందరూ కలిగి ఉండాలని తెలిపారు. ఎలైవ్ గాస్పల్ క్రిస్టియన్ బ్యాండ్ వారు ప్రత్యేక క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ముఖ్య వాక్యోపదేశకులుగా రెవరెండ్ డాక్టర్ నోవా ఎన్ ఆర్ డి క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. ఏసు క్రీస్తు ప్రభువు బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని



అంతర్జాల క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న వీసీ

తెలిపారు. కోవిడ్ కాలంలో ఎన్నో ఇబ్బందులను ప్రపంచం ఎదుర్కొందని నేడు నూతన సంవత్సరంలో అటువంటి సమస్యల నుండి ప్రభువు కాపాడాలని ప్రార్థించారు. రెవ. కృపా విల్సన్ శిరింగి ముగింపు ప్రార్థన చేసి క్రిస్మస్ దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, ప్రత్యేకాధికారులు ఆచార్య కొట్టి రమేష్, ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, కోఆర్డినేటర్ ఎన్.ఎస్.ఎస్ డా.బి.కెజియారాణి, కోఆర్డినేటర్, యూజీసీ డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.పి.వెంకటేశ్వరరావు, డా. తలారి వాసు, నందెపు నాగేంద్రరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

**మీడియా సెల్ 30.12.20** :ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు ప్రణాళికబద్ధంగా ప్రయత్నాలు చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వ విద్యాలయంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్ అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి కన్వీనర్ గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. తగిన విధంగా మార్గనిర్దేశం చేసుకొని లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ప్రస్తుత పోటీ



ప్రపంచంలో నిరంతర సాధన ఉంటేనే కానీ ఉన్నత శిఖరాలను చేరుకోలేమని అన్నారు. ఎన్ని ఆటంకాలున్నా లక్ష్యం కోసం ప్రయత్నిస్తే విజయాలను సాధిస్తారని చెప్పారు. తమ అనుభవాల్లో నుండి సివిల్ సర్వీసెస్‌కు ఏ విధంగా సిద్ధపడాలో వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ మొక్కా జగన్నాథరావు గతంలో సివిల్ సర్వీసెస్‌కు అర్హత సాధించి తనకెంతో ఇచ్ఛమైన అధ్యాపక వృత్తిని స్వీకరించారని తెలిపారు. మనం చేస్తున్న పనిని త్రికరణ శుద్ధిగా చేస్తూ ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. దీనిలో రీసోర్స్‌పర్సన్స్‌గా ఎం.శ్రీరామ్, డా.బి.కెజియారాణి కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు చక్కని అంశాలను, సూచనలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రతిభా వాణి

## రఘుపతి వెంకటరత్నం

(1862 - 1939)



'బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు'... ఈ పేరు తలచుకోగానే సంస్కారవంతుల్లో ఒక వినమ్ర భావం కలుగుతుంది. ఒక ఆంతరికమైన చైతన్య రేఖ కదులుతుంది. రాజా రామ్మోహన్ రాయ్ బ్రహ్మసమాజ సిద్ధాంతాల్లోని పవిత్రత అంతా ఆయనలో మూర్తీభవించింది. ఉపనిషత్తుల దివ్య బోధలన్నీ ఆయన ఆచరణలో జీవింపజేశారు. విద్యారంగంలో సుప్రసిద్ధులైన వారిలో ఆయన ఒకరు. మతాన్ని మానవ జీవితానికి పునీతంగా సమన్వయింపజేసిన మహితాత్ముడు.

మచిలీపట్నం నోబుల్ కళాశాలలో అధ్యాపకునిగా ఉత్తమ దేశభక్తులను, సంస్కారులను, నీతి వర్తనులను ఎందరినో తీర్చిదిద్దారు. కాకినాడ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్న సమయంలో సంఘ సంస్కరణోద్యమానికి విశేష కృషి చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతల్ని నిర్వహించారు. ఆయన విశ్వకుటుంబి. పిఠాపురం రాజా గారి ఆర్థిక పర్యవేక్షణలో ఆ రోజుల్లో కాకినాడలో నిర్వహింపబడుతున్న అనాథాశ్రమానికి రఘుపతి వెంకటరత్నం గారు దివ్యజ్యోతి. అనాథులందరూ ఆయన బిడ్డలు. కులమత తారతమ్యాలకు ఆయన అతీతుడు. బీద విద్యార్థులకు ఎందరికో ఎన్నివిధాలుగానో ఆయన సాయంచేస్తూ ఉండేవారు. వాళ్లకు తెలియకుండానే వాళ్ల జీతాలు, పరీక్ష ఫీజులు ఆయన చూసుకుంటూ తన విద్యార్థులను కన్నతండ్రి లా ప్రేమించేవారు. ఒకసారి మద్రాసుకు ప్రయాణం చేస్తుండగా పొన్నేరి రైల్వేస్టేషన్‌లో అనాథలైన నలుగురు పసి బాలికలను చూసి వాళ్లను దత్త పుత్రికలుగా చేసుకుని వాళ్లకు చదువుసంధ్యలు చెప్పించి కన్న తండ్రిలా వివాహాలు చేసి జీవిత సార్థకత చేకూర్చారు. మతాన్ని సకలజన హితానికి సాధనంగా భావిస్తే ఏ మతమైనా ఒకటేనని ఇటువంటి ఉత్తముల జీవితం వలన తెలుసుకోవచ్చును. వారికిదే నన్నయవాణి అక్షర నీరాజనం!!

## అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించడమే నా లక్ష్యం



పేదరికం ప్రతిభకు ఆటంకం కాదని రేపటి తరానికి ఆదర్శం కావాలని ఆడపిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ సగర్వంగా అంతర్జాతీయ స్థాయిలో విజయపరంపర కొనసాగించాలని నా లక్ష్యం. ఒకవైపు పేదరికం, మరోవైపు బాక్సింగ్‌లో అంతర్జాతీయస్థాయిలో రాణించాలని దృఢ సంకల్పం, మరోవైపు నన్నయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ రాజనీతి శాస్త్ర అధ్యయనం. ఈ పరంపరలో ఎటువైపునకు వెళ్లాలనే సంక్లిష్ట పరిస్థితుల్లో మా శాఖ అధ్యాపకుల సహకారం మరువలేనిది. నా లక్ష్యం రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయికి వెళ్లడమే కాదు అంతర్జాతీయ స్థాయిలో తెలుగు అమ్మాయి త్రివర్ణ పతాకం పట్టుకుని విజయ దుందుభి మోగించి నా కలలు నెరవేరుతాయని ఆశిస్తున్నాను. ఆడపిల్లలు క్రీడల్లో రాణించాలని ధైర్యంగా సాహస కృత్యాలతో ప్రపంచానికి ఆశ్చర్యం కలిగించే బాక్సింగ్‌లో పాల్గొనడం ద్వారా ఎంతోమంది ఆడపిల్లలకు నేను స్ఫూర్తిగా నిలవాలన్నది నా ధ్యేయం. ఆడపిల్లలు ధైర్యంగా నిలబడాలి పురుషులతో పాటు స్త్రీలు సమాన హక్కులను అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆధునిక సమాజానికి ఆదర్శం కావాలి. అందుకే నేను డిగ్రీ స్థాయి నుంచి జాతీయస్థాయిలో విజయం సాధించాను. అలాగే కరాటేలో రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించాను. ఇప్పుడు బాక్సింగ్‌లో జాతీయస్థాయిలో రెండోసారి పాల్గొంటున్నాను. ఇవన్నీ నా తండ్రి ప్రోత్సాహంతోనే సాధించగలిగాను. నా తండ్రి నాకు ప్రథమ గురువు. చిన్నప్పటినుంచే మా నాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. మా నాన్న నాకు ప్రాణం. ఆదర్శం. ప్రేరణ. నా ఆశయం స్థిరమైన క్రీడ లోనే కాదు స్థిరమైన ఆదర్శవంతమైన సేవా దృక్పథం గల పోలీస్ శాఖలో ఉద్యోగం చేసి మహిళా లోకానికి ఆదర్శనీయంగా ఆచరణీయగా నిలబడాలనే లక్ష్యం. నేను బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించినా నా ఆర్థిక పరిస్థితి పేదరికం జాతీయస్థాయిలో పాల్గొనడానికి అడ్డుపడ్డాయి. మా రాజనీతి శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ రాజశేఖర్ గారు నా పరిస్థితిని తెలుసుకుని రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి అన్ని విధాలా సహకరించారు. అది మరువలేనిది. ఆయన నన్ను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు గారి దగ్గరకు తీసుకెళ్లి నా పరిస్థితిని వివరించారు. ఆయన వెంటనే స్పందించి రిజిస్ట్రార్ బట్టు గంగారావు గారితో సంప్రదించి తక్షణమే రూ. 5,000 మంజూరు చేసి ప్రోత్సహించారు. విజయం చేకూరేలా ఆశీర్వదించారు. అందుకు వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే క్రీడా రంగంలో ప్రోత్సహిస్తూ ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా నాకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు గురువుగారైన మధుకుమార్ సార్. ఆయనకు ఎంతగానో రుణపడి ఉంటాను. వారికి నా తరపున మా కుటుంబం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు.

స్ఫూర్తి

**- ఎం.తులసి,**
**ఎం.ఎ.పొలిటికల్ సైన్స్,**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణం.**

## నన్నయ విద్యార్థినికి రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో స్వర్ణ పతకం



తులసికి అభినందనలు తెలియజేస్తున్న వీసీ

**మీడియా సెల్ 29.12.20** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పొలిటికల్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎం.తులసి రాష్ట్రస్థాయి థాయ్ బాక్సింగ్ పోటీలలో స్వర్ణపతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తులసిని వీసీ శాలువాతో సన్మానించి స్వర్ణ పతకాన్ని, సర్టిఫికెట్‌ను అందించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామం నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన తులసి పట్టుదలతో థాయ్ బాక్సింగ్‌లో రాణిస్తుందన్నారు. 27న తుని (పాయకరావుపేట)లో జరిగిన రాష్ట్రస్థాయి థాయ్ బాక్సింగ్ పోటీలలో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విశ్వవిద్యాలయం తరపున తులసికి కావాల్సిన సహకారాన్ని అందిస్తామని వీసీ తెలియజేసారు. తులసికి మార్గనిర్దేశం చేస్తున్న పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. రాజశేఖర్, కోచ్ బి.మధుకుమార్‌లను అభినందించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, అధికారులు అధ్యాపకులు తులసికి అభినందనలు తెలిపారు.

## ఢిల్లీ ఆర్‌డికి ఎంపికైన దినేష్‌కు సత్కారం



**మీడియా సెల్ 30.12.20** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం అనుబంధ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో ఉన్న వాలంటీర్ ఆర్ దినేష్ మణి సాయి ఢిల్లీ ఆర్‌డిలో పాల్గొన్న సందర్భంగా విద్యార్థికి వీసీ మొక్కా జగన్నాథరావు శుభాకాంక్షలు తెలియజేసి మెమోంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డా.కెజియా రాణి, డా.వి.మల్లిప్రియ, డా.కె.రాజమణి విద్యార్థిని అభినందించారు.

## ఉన్నత విద్య మార్పుకు ఇదే సమయం

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి

**మీడియా సెల్ 28.12.20** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు, విద్యా వ్యవస్థ మార్పుకు ఇదే చక్కని సమయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో "ఎ.కె.ఎన్.యు లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్"ను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి హాజరై లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ సీడీలను ఆవిష్కరించారు. అలాగే యూనివర్సిటీ వన్ ఇయర్ ప్రోగ్రాస్ రిపోర్టు పుస్తకాన్ని మరియు డాక్టర్ ఎం.గోపాలకృష్ణ రచించిన విలువలు విద్య & వృత్తి పరమైన విలువలు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఆచార్య మొక్కా జగన్నాథరావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి విశ్వవిద్యాలయాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్రంలో ఎక్కువ వెబినార్లు నిర్వహించి కోవిడ్ సమయంలో విజ్ఞానాన్ని వికసింపచేసారని వీసీకి అభినందనలు తెలియజేసారు. విద్యా వ్యవస్థలో మార్పుకు నూతన జాతీయ విద్యావిధానం దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు. మూడు సంవత్సరాలు డిగ్రీ చదువుతో పాటు నాలుగవ సంవత్సరం రీసెర్చ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుందని తెలిపారు. వై.ఎస్.జగన్మోహనరెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. విద్యావ్యవస్థ అభివృద్ధికి, విద్యావ్యవస్థ మార్పుకు ఇది చక్కని సమయమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమాజానికి హితమైన విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. విద్యా ప్రమాణాలలో నాణ్యత పెరగాలని విద్యాబోధన విద్యార్థులను ప్రభావితం చేయాలని, విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి భరోసాను కల్పించే విధంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం రాజకీయ నాయకుల వద్దకు వెళ్ళే పరిస్థితులు మారాలని చెప్పారు. నాణ్యమైన విద్యాభివృద్ధికి సమిష్టిగా కృషిచేయాలని తెలియజేసారు. వీసీ మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ సాంకేతిక విద్యాభివృద్ధికి కోవిడ్ చక్కని అవకాశాన్ని కల్పించిందని భవిష్యత్‌లో ఆన్‌లైన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఎ.కె.ఎన్.యు లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా అన్ని డిగ్రీ కోర్సులకు సంబంధించిన పాఠ్యాంశాలను యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా పొందవచ్చునని అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విద్యార్థులే విశ్వవిద్యాలయానికి ప్రధానమని వారికి అవసరమైన విద్యను, సాంకేతిక విజ్ఞానాన్ని అందిస్తూ భవిష్యత్‌లో వర్సిటీని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. తర్వాత ఆచార్య హేమచంద్రరెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, సిడిసి డీన్ డా.ఎం.కమలకుమారి, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.పి.రాజశేఖర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు మరియు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.



లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ హేమచంద్రరెడ్డి

# ఎడ్యుకేషన్ హబ్‌గా తాడేపల్లిగూడెం క్యాంపస్

| | |
|---|---|
| బోధన సిబ్బంది | 07 |
| విద్యార్థుల సంఖ్య | 78 |
| కెమిస్ట్రీ ల్యాబ్స్ | 03 |
| ఫార్మసీ ల్యాబ్స్ | 03 |
| సెమినార్ హాల్ | 01 |
| లైబ్రరీ | 01 |
| కంప్యూటర్ ల్యాబ్ | 01 |
| ప్లేస్‌మెంట్ డ్రైవ్ | 01 |

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణం, తాడేపల్లిగూడెం క్యాంపస్ 2004లో స్థాపించబడింది. 06-04-2017కి ముందు ఈ ప్రాంగణం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలనా నియంత్రణలో ఉంది. నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా జిఒ ఎంఎస్ 19 ప్రకారం 06-04-2017 తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి తాడేపల్లిగుడెం క్యాంపస్ అనుబంధాన్ని బదిలీ చేసింది. సమాజంలోని అమ్మాయి, అబ్బాయిల విద్యా అవసరాలను తీర్చడం ఈ క్యాంపస్ యొక్క ప్రధాన లక్ష్యం. ఈ పవిత్ర లక్ష్యంతో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులను యూనివర్సిటీ ప్రవేశపెట్టింది. ఈ అకాడమిక్ సంస్థను పట్టణం నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఆహ్లాదకరమైన విశాలమైన వాతావరణంలో క్యాంపస్‌ను విద్యార్థుల కోసం తీర్చిదిద్దారు. ప్రస్తుత భవనంలో 03 కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ప్రత్యేక ఛాంబర్, కంప్యూటర్ ల్యాబ్, ఆఫీస్ రూమ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్యాకల్టీ రూమ్, ఒక డిజిటల్ క్లాస్ రూమ్‌తో సహా 03 క్లాస్ రూములు ఉన్నాయి. 01 గెస్ట్ రూమ్. 03 ఫార్మసీ ల్యాబ్స్, ఒక లైబ్రరీ ఉంది. మొదటి అంతస్తులో సెమినార్ హాల్ ఉంది. ఈ క్యాంపస్‌లో అనేక సామాజిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## గూడెం పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతమైన విద్య కల్పనే ధ్యేయంగా..



పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం క్యాంపస్ ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చెందుతుంది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌కు మంచి భవిష్యత్తు ఉంది. గూడెం పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను కల్పించేందుకు నన్నయ క్యాంపస్ కేంద్రంగా ఉండబోతుంది. ఇప్పటికే ఫార్మసీ, కెమిస్ట్రీవంటి డిమాండ్ ఉన్న కోర్సులను ఏర్పాటు చేసి విద్యార్థులకు చక్కని విద్యను అందిస్తూ ఉద్యోగాలలో స్థిరపడేందుకు అవకాశాలు కల్పిస్తున్నాం. విద్యార్థులకు చక్కని వసతి గృహాలను నిర్మిస్తున్నాం. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని డిమాండ్ ఉన్న కోర్సులను ఏర్పాటు చేసి గూడెం క్యాంపస్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

**ఆచార్య కొట్టి శ్రీ రమేష్** ప్రత్యేక అధికారి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్















| కోర్సులు | పరిచయం | సీట్లు |
|---|---|---|
| ఎంబిఎ | 2017 | 44 |
| ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ | 2019 | 30 |
| ఎంఎస్‌సి ఎనాలిటికల్ కెమిస్ట్రీ | 2019 | 15 |
| ఎంఎస్‌సి ఫిజిక్స్ | 2019 | 30 |
| బి.ఫార్మసీ | 2019 | 60 |







| JOB TITLE | QUALIFICATION | POSITIONS | LOCATION | SALARY |
|---|---|---|---|---|
| Trainee Chemist & Junior Chemists | B.Sc. Chemistry (2016 to 2020 Passed out) | More Than 250 | Deccan Fine Chemicals, Tuni | Up to 1,68,000pa |
| Chemist & Senior Chemists | B.Sc. Chemistry (Exp:1 to 3 years ) | 75 | Deccan Fine Chemicals, Tuni | Up to 3,00,000pa |
| MBA | HR / Marketing | 60 | Andhra Pradesh / Telangana | 13,000 to 15,000 pm |
| Fitters | ITI - Fitters | 30 | Hetero Drugs Comany Nakkampalli | 10,200 to 15,000 pm |
| Helper's | 10th Pass / Fail | 50 | Aurobindo Phamaceutical, Paravada | 12,000 pm |



